సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



యాప్‌లతో వేగలేం
పనిచేయని స్మార్ట్‌ఫోన్లు మాకొద్దు అంటూ అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ కార్యాలయాల్లో సెల్‌ఫోన్లను అప్పగించారు. 8లో ▸



సీహెచ్‌ఓలపై చిన్నచూపు
కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) నిరాదరణకు గురవుతున్నారు. సమ్మె చేసినా ప్రభుత్వం వీరిని పట్టించుకోవడం లేదు. 8లో ▸



ఆంక్షలపై నిరసన
పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓపై విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. 8లో ▸

న్యూస్‌రీల్

191 అర్జీల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్జీదారులతో స్వయంగా మాట్లాడి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావుతో కలిసి పీజీఆర్ఆర్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 191 అర్జీలను స్వీకరించినట్టు ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లాలో వాట్సాప్ గవర్నెన్స్ అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: పోలీసు శాఖకు వచ్చే ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ అర్జీలు పునరావృతం కాకుండా గడువులోపు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లాపోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా 11 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.

దత్తతపై అవగాహన
భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన దత్తత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పిల్లలు లేని తల్లిదండ్రులు దత్తత తీసుకునేందుకు పాటించాల్సిన నియమ, నిబంధనలను వివరించారు.

నవోదయ దరఖాస్తులకు గడువు పొడిగింపు
భీమవరం: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించినట్టు డీఈఓ ఈ.నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిపాలన కారణాల వల్ల ఈనెల 13 వరకూ గడువు పొడిగించారని పేర్కొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు
భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 15న 79వ స్వాతంత్య్ర దినోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో పంద్రాగస్టు వేడుకలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని, సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్, శకటాలు తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల్లో నిబంధనలు తప్పనిసరి
భీమవరం (ప్రకాశంచౌక్): కార్మిక చట్టాలు, ఉపాధికి సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం ప్రాన్ ప్రాసెసింగ్ యూనిట్ రైడింగ్ జిల్లాస్థాయి కమిటీ సభ్యులు, అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో పనిచేసే మహిళా కార్మికుల సంక్షేమానికి నిబంధనలను విధిగా పాటించాలన్నారు. పని గంటలు, పని పరిస్థితులు మెరుగ్గా ఉండాలన్నారు. ఫ్యాక్టరీల్లో ఎక్కడ బాల కార్మికులు ఉండకూడదన్నారు. మంగళవారం నుంచి నెలాఖరు వరకు జిల్లాలోని ప్రాన్ ప్రాసింగ్ యూనిట్లను పరిశీలించి నివేదిక అందజేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఏ.లక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగలింగాచార్యులు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, ఎంపెడా అధికారి గోపాల్ ఆనంద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎఫ్ఈఓ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ కోవర్ట్ ఆపరేషన్

- రగులుతున్న జన సైనికులు
- పోలవరం ఎమ్మెల్యేను ఇరకాటంలో పడేసిన టీడీపీ శ్రేణులు
- ఉద్దేశ పూర్వకంగానే ఆడియో లీక్ చేశారని అభియోగం
- ముదురుతున్న జనసేన వర్సెస్ టీడీపీ రగడ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం ఎమ్మెల్యే అవినీతి వ్యవహారం జిల్లా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. వంద కోట్ల అవినీతి దేశానికే రోల్‌మోడల్ అంటూ దేవినేని ఉమ చేసిన వ్యాఖ్యల ఆడియో టేప్ హాట్‌టాపిక్‌గా మారిన క్రమంలో జన సైనికులు రగిలిపోతున్నారు. టీడీపీ కోవర్ట్ ఆపరేషన్‌తోనే ఇదంతా చేసి రాజకీయంగా జనసేనను పోలవరంలో అణచివేయడానికి తెరతీసిందని, దీనికి జనసేన కీలక నేత కరాటం రాంబాబును పావుగా వాడుకున్నారనే ప్రచారం జోరందుకోవడంతో నియోజకవర్గంలో జనసేన వర్సెస్ టీడీపీ రగడ హాట్ హాట్‌గా మారింది.

జనసేన భవితవ్యం గందరగోళం

జనసేన, టీడీపీ ఆధిపత్యపోరు కొనసాగిస్తున్న తరుణంలో తాజా ఎపిసోడ్‌తో జనసేన భవితవ్యం గందరగోళంలో పడింది. ఎమ్మెల్యే ఏడాదిలోనే వంద కోట్లు సంపాదించాడు.. భారీ భవనం కట్టుకున్నాడు.. దేశానికే అవినీతిలో రోల్‌మోడల్‌గా నిలిచాడంటూ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వర్గం మండిపడటం మినహా మరేమీ చేయలేని పరిస్థితి. అయితే ఇదంతా అబద్ధపు ప్రచారం, తప్పుడు ఆడియో రికార్డు అని ఎవరూ ఖండించకుండా పెద్ద మనుషుల మధ్య జరిగిన సంభాషణలు టీడీపీ ఎలా బయటపెడుతుందని, దీనిపై స్పందించాలని జనసేన చోటా నేతలు బలంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మొదలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వరకు ఎవరూ స్పందించని పరిస్థితి. మూడు రోజులుగా ఎమ్మెల్యే అవినీతి చేయలేదంటూ.. జనసేన కేడర్ చెప్పడమే కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏం చేయాలనే దానిపై సందిగ్ధం నెలకొంది. దేవినేని ఉమాతో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ అనుచరుడు పరిమి రాంబాబు చౌదరి అతడి ఫోన్ నుంచే కరాటం రాంబాబుతో మాట్లాడించారు. ఆడియో వాయిస్ రికార్డును టీడీపీ నేత రాంబాబు చౌదరే బయటపెట్టాడని, అతడిపై టీడీపీ చర్యలు తీసుకోవాలని జనసేన డిమాండ్ చేస్తున్నా టీడీపీ లైట్‌గా తీసుకుంది.

టీడీపీ ట్రాప్‌లో కరాటం

మరోవైపు టీడీపీ ట్రాప్‌లో జనసేన నేత కరాటం రాంబాబు పడటం వల్ల పార్టీకి, ఎమ్మెల్యేకు భారీ డ్యామేజ్ జరిగిందనే అంతర్గత చర్చ కొనసాగుతోంది. పార్టీపరంగా ఇబ్బందులు వస్తే ఖండించాల్సిన నాయకుడే సంభాషించడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి జనసేనలో నెలకొంది. ఇంకోవైపు దీనిపై కరాటం రాంబాబు స్పందిస్తూ దేవినేని ఉమానే సమాధానం చెప్పాలని ఒక్క మాటతో ముగించడంతో ఎమ్మెల్యే వర్గం మళ్లీ డైలమాలో పడింది. తాజా పరిణామాల క్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారిక కార్యక్రమాల్లో ఆదివారం దూరంగా ఉన్నారు. ఈ క్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్, టీడీపీ నేత బొరగం శ్రీనివాస్ అన్నదాత సుఖీభవ సభలో పాల్గొనడం మరో చర్చకు తెరతీసింది. మొత్తంగా ఆడియో టేప్ వ్యవహారంలో జనసేన నేతనే టీడీపీ పావుగా వాడుకుని జనసేన ఎమ్మెల్యేనే అప్రతిష్టపాలు చేసేలా విజయవంతంగా మైండ్ గేమ్ నడిపింది.

స్మార్ట్ షాక్

స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో కూటమి తీరుపై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. ప్రజల ఆందోళనను పట్టించుకోకుండా స్మార్ట్ మీటర్ల బిగింపు పనులు చేస్తుండటాన్ని నిరసిస్తూ పోరుబాటకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ప్రజావేదిక ఆధ్వర్యంలో జిల్లా అంతటా మంగళవారం విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలకు నిర్ణయించాయి.



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాలు (ఫైల్)

విద్యుత్ బాదుడు
- స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్న ప్రజాసంఘాలు
- ఉపాధిపై ఆందోళనలో మీటర్ రీడర్లు
- పట్టించుకోని ఏపీఈపీడీసీఎల్
- నేడు విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలకు ప్రజావేదిక పిలుపు
- జిల్లాలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 7,33,964
- తొలిదశలో కేటగిరీ–2 సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

అభ్యంతరాలివిగో..
- స్మార్ట్ మీటర్ల బిగింపు కేవలం మీటర్లు మార్పు మాత్రమే కాదని, విధాన మార్పుగా విద్యుత్ పంపిణీ సంస్థల్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రగా ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.
- ప్రస్తుతం కమర్షియల్‌కు మాత్రమేనంటున్నా రానున్న రోజుల్లో గృహావసరాలకు అమర్చుతారన్న అనుమానాలున్నాయి.
- సెల్‌ఫోన్ తరహాలో ఇక ముందుగానే సొమ్ము చెల్లించి కరెంటు రీచార్జి చేయించుకోవాలి. స్మార్ట్ మీటరు ఖర్చు సింగిల్ ఫేజ్‌కు రూ.9,000, త్రీఫేజ్‌కు రూ.17,000లు 93 నెలల వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు.
- మీటరు పాడైతే కొత్త మీటరుకు అయ్యే ఖర్చు వినియోగదారులే భరించాలి.
- పగలు కంటే రాత్రి వినియోగానికి అధిక చార్జి వసూలు చేస్తారు. వేసవి కాలంలో చార్జీలను పెంచేస్తారు. వైర్‌లెస్ టెక్నాలజీ ద్వారా నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచే మీటర్లను ఆపరేట్ చేస్తారంటున్నారు.
- బిల్లుల్లో తప్పులకు సమాధానం చెప్పే నాథుడు ఉండడు. ఈ మీటర్లతో ప్రజల వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం వాటిల్లుతుందనే అనుమానాలు ఉన్నాయి.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు

గృహావసరాలు	6,18,238
కమర్షియల్	81,192
ఇండస్ట్రియల్	2,096
పంచాయతీ, మున్సిపల్	14,685
అగ్రికల్చర్	17,753



సాక్షి, భీమవరం: జిల్లాలో డొమెస్టిక్, కమర్షియల్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ 7,33,964 విద్యుత్ కనెక్షన్లు ఉండగా నెలకు 235.16 మి.యూ. విద్యుత్ వినియోగమవుతోంది. ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీసీఏ) పేరిట కూటమి ప్రభుత్వం చార్జీలు పెంచేసింది. ఫిక్స్‌డ్, కస్టమర్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ చార్జీలు సర్దుబాటు పేరిట వినియోగం కన్నా రెండు, మూడు రెట్లు వస్తున్న బిల్లులతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లకు మినిమమ్‌కు బదులు రూ.600లకు పైగా బిల్లు వస్తుంటే, తాజాగా స్మార్ట్ మీటర్ల బిగింపు ఆందోళనకు గురిచేస్తోంది.

స్మార్ట్ భయం : చార్జీలు పెరిగిపోతాయని వినియోగదారులు, వ్యాపార వర్గాలు, ఉపాధి కోల్పోతామని మీటర్ రీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. స్మార్ట్ మీటర్ల బిగింపు పనులను వేగవంతం చేస్తోంది. తొలిదశగా కమర్షియల్, ఇండస్ట్రియల్, స్థానిక సంస్థలకు చెందిన పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చుతోంది. రానున్న మార్చి నాటికి జిల్లాలో 1.02 లక్షల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు విద్యుత్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు దాదాపు 45 వేలకు పైగా మీటర్లను వేశారు. వీటిలో ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన కనెక్షన్లు 34 వేలు వరకు ఉండగా ఇండస్ట్రియల్ 225, విద్యాసంస్థలు 9400, ఆక్వా కనెక్షన్లు 300లు వరకు ఉన్నాయి.

మీటర్ రీడర్ల ఉపాధికి ఎసరు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో తాము ఉపాధి కోల్పోతామన్న ఆందోళనలో మీటర్ రీడర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది వరకు మీటర్ రీడర్లు ఉన్నారు. నెలకు సుమారు రూ.10 వేల వరకు వస్తుంది. స్మార్ట్ మీటర్లతో బిల్లు తీసే అవసరం ఉండకపోవడం వలన తాము పని కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాటకు సిద్ధమవుతున్నారు.

నేడు ఆందోళనలకు పిలుపు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు ఇప్పటికే ప్రజావేదికగా ఏర్పడి జిల్లాలోని పలుచోట్ల ఆందోళనలు నిర్వహించాయి. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిచ్చాయి. అందులోభాగంగా జిల్లాలోని విద్యుత్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

అపోహలు వీడాలి



స్మార్ట్ మీటర్ల వలన బిల్లులు పెరుగుతాయనేది కేవలం అపోహ మాత్రమే. పాత మీటర్లతో పోలిస్తే వీటి వలన వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. వినియోగదారులు ఎప్పటికప్పుడు ఎంత వినియోగించారో తెలుసుకోవచ్చు. మీటర్ల బిగింపునకు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.

– ఎ.రఘునాథబాబు, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ..



కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న స్మార్ట్ మీటర్లు వలన భవిష్యత్తులో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. సామాన్యులు మోయలేనంతగా బిల్లులు వస్తాయి. వీటి ఏర్పాటుకు వ్యతిరేకంగా తలపెట్టిన ఆందోళనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి.

–గోపాలన్, సీపీఎం జిల్లా కార్యదర్శి

స్మార్ట్ మీటర్లతో దోపిడీ



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలకొట్టండని లోకేష్ కూటమి నాయకులకు పిలుపునిచ్చారు. ఏడాదిలోనే విద్యుత్ చార్జీలు గణనీయంగా పెంచిన కూటమి, మళ్లీ పెంచేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులను దోచుకుంటుంది. అదనపు లోడు పేరుతో డిపాజిట్లుగా భారీ మొత్తాన్ని గుంజుతోంది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి డిస్కమ్ షాకును ఇవ్వాలి.

– బి.బలరామ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న యలమంచిలి ఎంపీపీ ధనలక్ష్మి

భీమవరం(ప్రకాశం చౌక్): యలమంచిలి మండల పరిధిలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని యలమంచిలి ఎంపీపీ ఐనుకొండ ధనలక్ష్మి సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. మండలంలో జరుగుతున్న శంకుస్థాపనలకు, ప్రారంభోత్సవాలకు తనకు, వైఎస్సార్‌సీపీ చెందిన సర్పంచులకు, ఎంపీటీసీలకు ఆహ్వానం గాని, ప్రొటోకాల్ పరంగా గౌరవం గానీ ఇవ్వడం లేదన్నారు. ఇలా అనుమానించడం సరైన పద్ధతి కాదన్నారు. మండలంలో తీర్మానాలు చేసిన వర్క్‌లకు ఆర్డర్స్ ఇవ్వకుండా, మండలాన్ని అభివృద్ధి చేయకుండా అధికారులు అలసత్వాన్ని వీడి, ప్రొటోకాల్ ద్వారా మండల అభివృద్ధికి తోడ్పడేలే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో పాటు పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి పాల్గొన్నారు.

రైతులను నిండా ముంచిన కూటమి సర్కారు

- రైతు భరోసా సాయంలో కోత
- ఆక్వా రైతులకు సహకారం కరువు
- రైతుల సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత



భీమవరం కలెక్టరేట్ వద్ద రైతు సమస్యలపై మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి, నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): రైతులను అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఈ పాలనలో రైతులకు నిండా కష్టాలేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో కలిసి జిల్లా నాయకులు భీమవరం కలెక్టరేట్‌కు వచ్చి ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏటా కేంద్రం సాయంతో కలిపి రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా తొలి ఏడాది ఎగ్గొట్టారని, ఈ ఏడాది కేవలం రూ.5 వేలు ఇచ్చి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రెండేళ్లకు రూ.40 వేలు బకాయి ఉంటే రూ.5 వేలు జమచేయడం మోసం కాదా అని ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో లేక బ్లాక్‌లో రైతులు కొంటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఇప్పటికీ సుమారు రూ.6 వేల కోట్ల ధాన్యం బకాయిలు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు పుష్కలంగా ఉండేవని, విత్తు నుంచి ధాన్యం కొనుగోలు వరకూ రైతులకు అండగా నిలిచామన్నారు. నాడు ఆక్వా రైతులకు చిన్నపాటి సమస్య వస్తే జగన్‌పై నెట్టేసిన కూటమి నాయకులు నేడు ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. రొయ్యల ధరలు తగ్గుతున్నా, ఫీడ్, సీడ్ ధరలు పెరుగుతున్నా నియంత్రణ లేదన్నారు. గత ప్రభుత్వంలో ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ అందించి అండగా నిలిచామన్నారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకట్రాయుడు, ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు, మొగల్తూరు జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, యలమంచిలి ఎంపీపీ వినుకొండ ధనలక్ష్మి, పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, కోడే యుగంధర్, నంద్యాల సీతారామయ్య, వేగేశ్న జయరామకృష్ణంరాజు, పాలపర్తి కృపానాథ్, చెన్ను విజయ్, ఉచ్చ స్టాలిన్, గణేశ్న రాంబాబు, పాలారాంబాబు, గొవెల్లి ధనుంజయ, డొక్కు సుబ్రహ్మణ్యం, గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారుమడులు ఎండినా పట్టదా?
మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నారు, గానీ ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లో నారుమడులకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో నాట్లు ఆలస్యమవుతున్నాయన్నారు. ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, పది రోజుల్లోపు ఎరువులు అందించకపోతే రైతులు నష్టపోతారన్నారు. కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా చేతులు ఎత్తేసిందన్నారు.

వ్యవసాయం దండగలా..
పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో వ్యవసాయం పండగా ఉండగా.. నేడు చంద్రబాబు పాలనలో దండగ అనే రీతిలో రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. సార్వా రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులో లేకపోవడం దారుణమన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచేందుకు రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

ఏలూరులో మహిళలపై దాడి ఘటనలో కేసుల నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరులో ఆదివారం రాత్రి మహిళలపై దాడి చేసిన ఘటనపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సీరియస్ అయ్యారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ పరిధిలో మరడాని రంగారావు కాలనీ, పోణంగి రోడ్డులోని జరుగులమ్మ తల్లి గుడి ప్రాంతానికి చెందిన కాటూరి నిర్మల కుమారుడు లక్కీ అనే యువకుడు తల్లికి టిఫిన్ తెచ్చేందుకు మోటారు సైకిల్‌పై బయల్దేరాడు. అతడు వీఎస్ఆర్ గ్రాండ్ సిటీ వద్దకు చేరుకునేసరికి పల్లెపు సాయికుమార్, తురక మురళి, గుంజే జాన్ అనే ముగ్గురు వ్యక్తులు.. మోటారు సైకిల్ వేగంగా ఎందుకు నడుపుతున్నావంటూ నిలదీశారు. ఈ విషయంలో వారితో వాగ్వివాదం చోటుచేసుకోగా, లక్కీని కొట్టారని బాధితులు చెబుతున్నారు. అనంతరం మరోసారి ఈ ముగ్గురితో పాటు నిడిగట్టి నాగరాజు, బత్తుల దుర్గారావు, మరికొంతమంది కాటూరి లక్కీ ఇంటి వద్దకు వెళ్లారు. ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగగా కొట్టుకున్నారని, ఆ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ రెండు వర్గాలపై ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్లలో కేసులు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ రెండు వర్గాల వారికీ ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, స్వల్ప వివాదం నేపథ్యంలోనే గొడవ జరిగిందని, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోలేదనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

మహిళల దుస్తులు చించేస్తూ.. భయోత్పాతం

బాధితురాలు కాటూరి నిర్మల సోమవారం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ తన కుమారుడు లక్కీని ముగ్గురు కలిసి కొట్టారని, లక్కీ ఇంటికి రాగా మరో 15 మంది వ్యక్తులు మహిళలని కూడా చూడకుండా ఇష్టారాజ్యంగా దుర్భాషలాడుతూ కొట్టారని, ఇదే సమయంలో మరో 50 మందిని పిలిపించుకుని తమ ఇళ్లపై దాడులు చేస్తూ భయోత్పాతం సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల దుస్తులు చించేస్తూ ఇష్టారాజ్యంగా దాడి చేశారన్నారు. దీనిపై ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. అనంతరం రక్షణ కల్పించాలంటూ ఏలూరు చిరంజీవి బస్టాండ్ వద్ద ఆందోళన చేశామని తెలిపారు. పోలీసులు తమకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో నిరసన విరమించామన్నారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు



సప్త ప్రదక్షిణ పూజలు చేస్తున్న అర్చక స్వాములు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవార ప్రదక్షిణల్లో భాగంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక



క్విజ్ పోటీల ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా అధికారి నరేంద్ర కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రెడ్ రిబ్బన్ క్లబ్ క్విజ్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర కృష్ణ తెలిపారు. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారం జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ హెచ్ఐవీ ఎయిడ్స్ కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలోని జూనియర్ ఇంటర్ విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్విజ్ జిల్లా వ్యాప్తంగా ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పీ శేఖర్ బాబు, ఇంటర్ ఎడ్యుకేషన్ రీజినల్ ఆఫీసర్ యోహాన్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రాజ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు



పతకాలు సాధించిన ఏలూరు ఖేలో ఇండియా సెంటర్ లిఫ్టర్లు

ఏలూరు రూరల్: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మహిళలు అద్భుత ప్రతిభాపాటవాలు సాధిస్తున్నారని ఏలూరు ఖేలో ఇండియా సెంటర్ ఇన్‌చార్జి వి.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల వివరాలు వెల్లడించారు. ఏలూరు సెంటర్ బాలికలు 15 మెడల్స్ సాధించారన్నారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో సోమవారం సాయంత్రం యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన బి.తన్వీర్ భీమవరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తన మిత్రులతో కలిసి బీచ్‌కి వచ్చాడు. అలల ఉధృతికి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న మొగల్తూరు ఎస్సై జి.వాసు సముద్రతీర ప్రాంతంలో గాలిస్తున్నారు.

యాప్‌లతో వేగలేం

సెల్‌ఫోన్లు తిరిగిచ్చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకోడేరు: సెల్‌ఫోన్లు ప్రభుత్వానికి తిరిగిచ్చేయాలనే నిర్ణయంతో సోమవారం విస్సాకోడేరు సీడీపీఓ కార్యాలయం వద్ద సెల్‌ఫోన్‌లను అప్పగించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నాయకురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ సిగ్నల్స్ లేక ఫోన్లు పనిచేయక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నామని, అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు తెలియచేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో యూనియన్ రాష్ట్ర కమిటీ సెల్‌ఫోన్లు ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని లేదంటే మరింత తీవ్రంగా ఉద్యమిస్తామని అన్నారు. సీఐటీయు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు పాల్గొని పోరాటానికి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఏలూరులో..

ఏలూరు(టూటౌన్): పనిచేయని స్మార్ట్‌ఫోన్లు మాకొద్దు అంటూ అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం వెనుకవైపున ఉన్న ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పని చేయని స్మార్ట్‌ఫోన్ల తో డేటా వివరాలు నమోదు చేయలేకపోతున్నామన్నారు. 5జీ టెక్నాలజీ యాప్‌లతో ఓల్డ్ వెర్షన్ ఫోన్లో ఎలా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ సమీమా, తలారి రజని మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త ఫోన్లు ఇచ్చే వరకు మాన్యువల్ పద్ధతిలోనే పని చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.



విస్సాకోడేరు సీడీపీఓ కార్యాలయం వద్ద సెల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట పనిచేయని ఫోన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



కైకలూరు సెల్‌ఫోన్ల బాక్సును సూపర్‌వైజర్‌కు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కైకలూరులో..

కైకలూరు: అంగన్‌వాడీ టీచర్లుకు ఇచ్చిన సెల్ ఫోన్లు పనిచేయడం లేదు. పైగా మూడు యాప్‌లలో వివరాలు నమోదు చేయడం కష్టమవుతోంది అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కైకలూరులో సెక్టార్ ఆఫీసు సూపర్‌వైజర్ ప్రసన్న లక్ష్మీకి సోమవారం సెల్‌ఫోన్లు ఇచ్చేశారు. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 311 సెల్‌ఫోన్లు వెనక్కి ఇచ్చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ప్రాజెక్టు సెక్రటరీ సుజాత మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో యాప్‌ల గొడవ లేకుండా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు మూడు యాప్‌లు కలిపి ఒక యాప్‌గా చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

విద్యాసంస్థల్లో ఆంక్షలపై నిరసన



భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన దృశ్యం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఏ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు

భీమవరం: విద్యా సంస్థల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా మరెవరికీ ప్రవేశంలేదంటూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించేలా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బి.గణేష్ విమర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వులను నిరసిస్తూ సోమవారం భీమవరం పట్టణం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మూలంగా విద్యార్థులు తమ స్వేచ్ఛను కోల్పోతారని వారి సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లే వారికి ఈ ఉత్తర్వుల ద్వారా అనుమతులుండవన్నారు. ఉత్తర్వులు ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని గణేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తర్వులను ఉపసంహరించకపోతే విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణ్, బి.సింధు, సాయికృష్ణ, హేమంత్, భాగ్యలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు విరమించుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జీవోను రద్దు చేయాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసి కమిటీ సభ్యులకు తప్ప ఇంకెవ్వరికీ అనుమతి లేదంటూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలన్నారు. విద్యారంగ సమస్యలపై, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ దశాబ్దాలుగా విద్యార్థి సంఘాలు అనేక ఉద్యమాలు చేశాయన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా విద్యారంగంలో గాని విద్యార్థులకు గాని సమస్యలు వస్తే తాము తప్పనిసరిగా న్యాయపోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ పట్టణ అధ్యక్షుడు మేడవాల రాజా, తానేటి రంజిత్ కుమార్, సిహెచ్ గణేష్, జి.భానుప్రకాష్, టి.మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

లైంగిక వేధింపుల నుంచి రక్షణకు కృషిచేయాలి

భీమడోలు: లైంగిక వేధింపుల నుంచి మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన కమిటీలు తమ వంతు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సదస్సును నిర్వహించారు. కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఉచిత న్యాయ సహాయాన్ని, బాధితులకు తాత్కాలిక, శాశ్వత పరిహారాన్ని అందిస్తాయన్నారు. జిల్లా బాలికా సంరక్షణాధికారిణి సీహెచ్ సూర్యచక్రవేణి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో లింగ నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయని, అలా చేసే వారిని చట్టం తీవ్రంగా శిక్షిస్తుందన్నారు. మహిళలకు అనేక చట్టాలున్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే రక్షణ పొందుతారన్నారు. పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలను న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సందర్శించి కళాశాలలోని వసతులు, పరిసరాలను పరిశీలించారు. చిన్నారులతో కలిసి భోజనం చేసారు. నాణ్యమైన, పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా మెనూలో మార్పులు తేవాలన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల శివారు అన్నపునేనివారిగూడెంకు చెందిన దుక్కిపాటి నాగరాజు (48)కూలి పనులు చేసేవాడు. తరచూ భార్యభర్తలు గొడవలు పడుతున్నారు. ఇటీవల గొడవలు అధికం కావడంతో మనస్తాపానికి గురై ఈ నెల మూడున పురుగుల మందు తాగాడు. బంధువులు అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి విజయవాడ తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

8న మావుళ్లమ్మకు గాజుల అలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రావణ శుద్ధ చతుర్థి ఉత్తరాషాఢ నక్షత్ర సహిత రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ఈనెల 8వ తేదీన భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ తల్లికి లక్ష గాజుల అలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలంకరణకు గాజులు ఇవ్వదలిచిన భక్తులు 7 వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటర్ నందు సమర్పించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈనెల 8 తేదీ నుంచి 10 తేదీ వరకు మావుళ్లమ్మ తల్లి గాజుల అలంకరణలో దర్శనమివ్వనున్నారని, భక్తులు దర్శించుకోవాలని కోరారు.

హోటళ్లపై దాడులు

తణుకు అర్బన్: గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన రాయితీ గ్యాస్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మ హెచ్చరించారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్న హోటళ్లపై సోమవారం దాడులు నిర్వహించారు. తణుకు పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్‌లపై దాడి చేసి మొత్తం 25 రాయితీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాదాస్పదంగా ఈవో తీరు

జంగారెడ్డిగూడెం: ఆలయాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి తీరు వివాదాస్పదంగా మారింది. పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో ఉన్న రామాలయానికి స్థానిక సుబ్బంపేటలో 33.65 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కోర్టు తీర్పు అనంతరం ఇటీవలే ఆ భూమిని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో సదరు భూమిలో ఉన్న ఆలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు సోమవారం ఈవో కలగర శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లారు. ఆలయాన్ని నిర్వహిస్తున్న వ్యక్తులతో ఆలయ తాళాలు ఇవ్వాలని కోరారు. దీనికి వారు ఆలయంలో తమకు సంబంధించిన వస్తువులు ఉన్నాయని, వాటిని తీసుకున్న తరువాత మీకు అప్పగిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఆలయ నిర్వాహకులతో ఈవో దురుసుగా వ్యవహరిస్తూ మాట్లాడటంతో చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. ఆలయాన్ని ఎందుకు అప్పగించరు; వ్యాపారాలు చేసుకుందామనా.. అంటూ ఈవో మాట్లాడటంతో ఆలయ నిర్వాహకులు అభ్యంతరం తెలిపారు. పారిజాతగిరి ఈవోగా వ్యవహరిస్తున్న కలగర శ్రీనివాస్ జంగారెడ్డిగూడెం మండలంలోని 25 ఆలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. పలు ఆలయాల్లో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక గ్రేడ్-1 దేవాలయాల పరిరక్షణలో గ్రేడ్-2 అధికారికి ఎలా బాధ్యతలు అప్పగించారో ఉన్నతాధికారులే చెప్పాలని పలువురు పేర్కొంటున్నారు. గ్రేడ్-1 దేవాలయాల పరిరక్షణలో గ్రేడ్-2 అధికారి ఈవోగా ఎలా బాధ్యతలు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈవో శ్రీనివాస్ దేవదాయ శాఖలో చేరిన సంవత్సరం, ఎస్ఆర్‌లో నమోదు చేసిన సంవత్సరంలో కూడా తేడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయం స్వాధీనానికి వెళ్లగా.. దానిని ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తుండగా అడ్డుకున్నానని, దాని వల్లే తనను అల్లరి చేస్తున్నారని ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు.



జంగారెడ్డిగూడెం పారిజాతగిరి ఈవో సుబ్రహ్మణ్యం నిర్వాహకులతో గొడవ పడుతున్న దృశ్యం

వర్షాకాలంలో విద్యుత్‌తో అప్రమత్తం

తణుకు అర్బన్: వర్షాకాలంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షాలకు వృక్షాలు కూలినప్పుడు, విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులకు తెగిపడుతున్న విద్యుత్ తీగలు తగిలి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. గృహాల్లో సైతం తడి చేతులతో స్విచ్‌లు వేయడం, వర్షాలకు స్విచ్ బోర్డులు తడిసి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం వంటివి చూస్తున్నాం. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ శాఖ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వర్షాకాలం మొదలైనా ఇంతవరకు విద్యుత్ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భారీ వర్షాల సమయాల్లో గృహోపకరణాల స్విచ్‌లు ఆఫ్ చేసి ఉంచాలి.
- కరెంటు స్విచ్ బోర్డుల్లో స్విచ్‌లను తడి చేతులతో తాకరాదు.
- చిన్న పిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలి.
- ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు తెలియచేయాలి.
- విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను తాకరాదు.
- ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో దగ్గరకు వెళ్లకుండా ముందుగా విద్యుత్ శాఖకు తెలియచేయాలి.



తణుకు స్ప్రింగ్‌బోర్డు స్కూలు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ క్యారియర్

- గృహాల ఆవరణలోని నీళ్ల మోటార్లకు ఉన్న కరెంటు వైర్లను తాకరాదు.
- గాలి, వాన సమయాల్లో కరెంటు లైన్ల కింద నిలబడడం, కూర్చోవడం చేయరాదు.
- రహదారుల్లో విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగిపడి ఉంటే విద్యుత్ ప్రవాహం ఉన్నట్లుగా భావించి దూరంగా ఉండాలి.
- మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వలన నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది. రైతులు జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ ప్రమాదానికి గురైన వారిని కానీ ఆ విద్యుత్ పరికరాన్ని కానీ నేరుగా తాకరాదు.
- వర్షాలు పడుతున్న సమయాల్లో రహదారులపై ఉన్న విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదు.
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ 1912 నంబరులో సంప్రదించాలి.

జ్వరంతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి

కుక్కునూరు: పుట్టిన రోజు జరుపుకోవాల్సిన రోజే జ్వరంతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన హృదయ విదారక ఘటన సోమవారం జరిగింది. మండలంలోని చిరవెల్లి గ్రామానికి చెందిన యర్నం ప్రదీప్, కావేరి దంపతులకు సహస్ర(6), స్నేహిత (3) సంతానం. సహస్రకు గత నెల 31న తీవ్రజ్వరం రావడంతో కుటుంబసభ్యులు భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ పాపకు పరీక్షలు చేసిన వైద్యులు ప్లేట్‌లెట్‌లు తగ్గినట్టు చెప్పి చికిత్సను ప్రారంభించారు. శనివారం పాపకు జ్వరం తగ్గకపోగా ప్లేట్‌లెట్‌ల సంఖ్య 15 వేలకు పడిపోయి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు రిఫర్ చేశారు. ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం ఉదయం చిన్నారి మృతి చెందింది.



మృతి చెందిన సహస్ర

సీహెచ్‌ఓలపై చిన్నచూపు

- నమ్మె చేసినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హామీలు అమలు చేయాలని డిమాండ్



గత ప్రభుత్వం నిర్మించిన సీహెచ్‌ఓ భవనం

పెంటపాడు: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌ఓ)లు నిరాదరణకు గురవుతున్నారు. గత జగనన్న ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియమితులైన వీరిని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉద్యోగ భద్రత లేక, సకాలంలో జీతాలు అందక, సేవలు అందిస్తున్నా సరైన గౌరవం దక్కక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 368 సీహెచ్‌ఓలు పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్య సేవలో భాగంగా వీరికి 2019 నుంచి పోస్టులు మంజూరయ్యాయి. పీహెచ్‌సీల కన్నా మొదట వీరు ప్రాథమికంగా వైద్యనిర్ధారణ చేసి వ్యాధి తీవ్రతను బట్టి కేసులపై అధికారులకు రిఫర్ చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో 14 రకాల సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య సర్వే, ఫ్యామిలీ హెల్త్ ఆరోగ్య సేవలు, ఇంటింటికీ సేవలతో పాటు, అంగన్‌వాడీ ప్రధానంగా గ్రామీణ ప్రజలకు చేరువగా ఉంటున్నారు. అయినా వారిని పాలకులు పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీ హెల్త్ అధికారుల యూనియన్ పిలుపు మేరకు ప్రతి జిల్లా కేంద్రంలోనూ మే నెలలో ఒక నెల పాటు పలు ప్రాంతాలోల సీహెచ్‌వోలు నిరసనలు తెలిపారు. కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అయినా వీరి సమస్యలు నేటికీ తీరలేదు.


ప్రధాన డిమాండ్‌లు

- ఆరేళ్లు పూర్తయిన కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌ఓ)లను తక్షణం క్రమబద్ధీకరించాలి.
- ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- జీతాలతో పాటు, ఇన్సెంటివ్‌లు అందించాలి.
- గ్రామాల్లో ప్రభుత్వ క్లినిక్‌ల అద్దెలను సకాలంలో చెల్లించాలి.

రేషనలైజేషన్ పేరుతో కుదింపు చర్యలు

వీరిని రేషనలైజేషన్ పేరుతో కుదించేందుకు కూటమి ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సీహెచ్‌ఓలు మనోవేదనకు గురౌతున్నారు. 5 వేల జనాభా ఉన్న ప్రాంతంలో ఒక సీహెచ్‌ఓను నియమించే యోచనలో ఉన్నట్లు సమాచారం. రేషలైజేషన్‌లో భాగంగా ఏ ప్రాతిపదికన ఈ చర్యలు చేస్తున్నారో తెలియడం లేదని చెబుతున్నారు. పేదలకు ఆరోగ్యం కోసం పాటు పడుతున్న వీరిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారం. పొరుగురాష్ట్రాల్లో సీహెచ్‌వోల సేవలను అక్కడి పాలకులు గుర్తించారు. మన రాష్ట్రంలో వీరిని పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.


గ్రామంలోనే సేవలందిస్తున్నాం



ఎంతో దూరంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మా గ్రామంలోనే మందులు అందిస్తున్నారు. అయినా ప్రభుత్వం వారి సేవల్ని గుర్తించడం లేదు.

– కె. వెంకట్రావు, అలంపురం

సకాలంలో వైద్య సేవలు



108,104 సేవల కన్నా రోజు మా గ్రామంలో ఆరోగ్యసేవలు అందిస్తున్న సీహెచ్‌ఓ వల్ల మాకు ఎంతో మేలు కలుగుతోంది. మందులు సకాలంలో అందిస్తున్నారు.

జయవరపు విజయదుర్గ, అలంపురం

క్రీడా దినోత్సవం సందర్భంగా పోటీలు

ఏలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని అండర్-22 విభాగంలో మహిళలు, పురుషులకు 10 క్రీడాంశాల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగష్టు 5 నుంచి 10 వరకూ జిల్లా పోటీలు, 11 నుంచి 14 వరకూ జోనల్, 16 నుంచి 20 వరకూ రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఏలూరు జిల్లా స్థాయి పోటీలను 6, 7 తేదీల్లో చేపట్టనున్నామని వివరించారు. 6న జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరులో స్విమ్మింగ్, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్, ఖండ్రికగూడెం బాక్సింగ్ ఆకాడమీలో బాక్సింగ్ పోటీలు జరుగుతాయని వివరించారు. 7న అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీలు, ఇండోర్ స్టేడియంలో వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు చేపడతామని వెల్లడించారు. మరింత సమాచారం కోసం 9866317326 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రతినెలా 5న ర్యాలీలు

ఏలూరు(మెట్రో): వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించేందుకు ప్రతి నెలా 5న జిల్లాలోని అన్ని సచివాలయాలు పరిధిలో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఏలూరు కలెక్టరేట్ నుంచి ఆమె టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 95523 00009 ఫోన్ నెంబర్ ద్వారా 570లకు పైగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో పాత నేరస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: మద్యం అక్రమ రవాణా, అక్రమ విక్రయాలు, గంజాయి విక్రయాలపై కఠినచర్యలు తీసుకుంటామని తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి హెచ్చరించారు. తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో గంజాయి, సుంకం చెల్లించని మద్యం రవాణా, విక్రయాల కేసుల్లో పాత నేరస్థులైన 9 మందికి సోమవారం తణుకు కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్థులు ఈ తరహా నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం నేరస్థులతో విడివిడిగా సంభాషించి ప్రస్తుతం వారు నిర్వహిస్తున్న వృత్తి, కదలికలు, సత్ప్రవర్తన వంటి అంశాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కోపల్లెలో కేవీకే శాస్త్రవేత్తల పర్యటన



కోపల్లెలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కాళ్ల: మండలంలోని కోపల్లె గ్రామంలో ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. దీనిలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు అందించిన నూతన వరి రకము ఏంటీయూ 1212 క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో నూతన వరి వంగడం రకం కాల పరిమితి 140 రోజులని, సీజనల్‌గా వచ్చే తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందన్నారు. పంటకు కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని, వాటి వలన జింకు, ఐరన్ లోపాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. నత్రజని, పొటాష్‌లను మాత్రమే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎస్.మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, ప్రవీణ, ఏవో రమేష్ నాయుడు, వీఏఏ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

ఆకివీడు: స్థానిక 14వ వార్డులో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు, సీపీఎం నాయకులు సోమవారం ప్రజా పరిష్కార వేదిక వద్ద తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వార్డులోని జవహర్‌పేట, ఇతర వీధుల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం నాయకులు డీ.రవితేజ, బీవీ.వర్మ, ఎస్.ఉదయకుమారి మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా కొందరు చేసిన ఆదేశాల మేరకు నీటి సరఫరా నిలుపుదల చేశారని ఆరోపించారు. 14వ వార్డుకు సరఫరా చేసే నీటిని వేరే వార్డుకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీ.లావణ్య, యర్రా కృష్ణవేణి, ఎస్.సూరిబాబు, ఎస్కే.బాజీ బాధిత మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్, దుస్తుల బహూకరణ

పాలకోడేరు: గొల్లలకోడేరు ఉన్నత పాఠశాలలో 1986–91 సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమ వంతు సహాయంగా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్, డ్రెస్సులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంతెన రవి వర్మకు సోమవారం అందజేశారు. పాఠశాల పీడీ శంకర్, పూర్వ విద్యార్థులు ఎం.విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

5 నుంచి రక్తదాన పక్షోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈనెల 5 నుంచి 18వ తేదీ వరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన ప్రచార పక్షోత్సవాలకు సంబంధించి గోడపత్రికను కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తం కొరత కారణంగా ఏ ఒక్కరూ ప్రాణం పోకూడదనే ఉద్దేశ్యంతో రక్తదానంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డీఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శివరామ బద్రిరాజు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డ్వామా పీడీ డా.కెసీహెచ్ అప్పారావు, పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాలో మురుగునీరు తిష్ట

- మురుగునీటిపై తేలియాడుతున్న వ్యర్థాలు
- దుర్గంధం.. దుర్వాసనతో అల్లాడుతున్న రోగులు
- డ్రెయినేజీల్లో దోమ లార్వా కదలికలు
- రోగుల రక్తం పీల్చేస్తున్న దోమలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మలమూత్రాలతో నిల్వఉన్న మురుగునీరు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మ్యాన్‌హోల్స్ మూసుకున్న దృశ్యం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో మురుగు, లార్వాతో నిండిన డ్రెయినేజీ

తణుకు అర్బన్: రోగాన్ని నయం చేసుకుందామని సర్కారు దవాఖానాకు వస్తే కొత్త రోగాలు వ్యాపించేలా ఉన్నాయని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారి మల, మూత్రాలతో నిండిన మురుగునీరు నిల్వ ఉండడంతో రోగులు అల్లాడుతున్నారు. ఆస్పత్రి చుట్టూ కొన్ని ప్రాంతాల్లో ఈరకంగా మురుగునీరు నిల్వ ఉన్నప్పటికీ ఆస్పత్రి వర్గాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కొన్ని రోజులుగా ఆస్పత్రి ఆవరణ దుర్గంధంగా మారిందని రోగులు ఆరోపిస్తున్నారు. మురుగునీరు నిల్వతో ఆస్పత్రి ఆవరణ దుర్వాసనతో ఉండడంతో ఇన్‌పేషెంట్స్ ఆందోళన చెందుతుండగా, ఓపీకి వచ్చే రోగులు సైతం బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా ఆస్పత్రి కావడంతోపాటు తణుకు చుట్టుపక్కల 100 గ్రామాలకు పెద్దాసుపత్రిగా 150 పడకలతో అత్యుత్తమ సేవలందిస్తున్న ధర్మాసుపత్రికి నేడు పారిశుధ్య సమస్య ఏర్పడింది. స్పెషలిస్ట్ వైద్యులతో పాటు ప్రసవాల కోసం జిల్లా నలుమూలల నుంచి ఆస్పత్రికి అధికసంఖ్యలో రోగులు, గర్భిణులు వస్తుంటారు. నిత్యం 500లకుపైగా ఓపీ నమోదవుతున్న ఈ ఆస్పత్రి గతం నుంచి ఎన్నో అవార్డులు అందుకుని రాష్ట్రస్థాయిలో మొదటివరుసలో ఉండే పరిస్థితి నుంచి నేడు మురుగునీరు ప్రవాహం బయటకు వెళ్లలేని దుస్థితిలోకి రావడం శోచనీయం.

దయాలసిస్, లెప్రసీ రోగుల ఆందోళన

ఆస్పత్రి ఆవరణలో మురుగునీటి నిల్వలు ప్రధాన సమస్యగా మారాయి. పై అంతస్థుల నుంచి పైపుల ద్వారా కిందికి వస్తున్న మల, మూత్రాలతోపాటు మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతానికి సమీపంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న డయాలసిస్ సెంటర్‌తోపాటు లెప్రసీ వార్డు, శ్రీసత్యసాయి అన్నప్రసాదం అందించే విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా డయాలసిస్ విభాగానికి వచ్చే రోగులకు ఎంతో పరిశుభ్రతతో వాతావరణం ఏర్పాటు చేయాల్సి ఉంది. సెంటర్‌కు వచ్చే రోగులకు ఎటువంటి ఇన్‌ఫెక్షన్స్ దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా లెప్రసీ వార్డులో ఉండే రోగులకు సైతం ఇన్‌ఫెక్షన్స్ సోకే ప్రమాదం లేకుండా జాగ్రత్తలు పాటించాలి. ఇక ఇదే ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న శ్రీసత్యసాయి అన్నప్రసాద విభాగం నిత్యం 100కు పైగా రోగుల సహాయకులకు అన్నప్రసాదాన్ని అక్కడే తయారుచేసి భోజనం అందజేస్తున్నారు. అటువంటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతం అత్యంత దుర్గంధంగా మారడంతో భోజనం చేసేందుకు సైతం అడ్డంకిగా మారిందని రోగులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు డ్రెయినేజీల్లో సైతం మురుగునీరు ప్రవాహం జరగకపోవడంతో నిల్వ ఉన్న మురుగుపై దోమలు విడిచిన లార్వా కదులుతున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తుండడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. దీంతో రాత్రి సమయంలో దోమల బాధ తీవ్రతరమై రోగులు, సహాయకులు అల్లాడిపోతున్నారు. ఉక్కపోత వాతావరణానికి తోడు దోమల తీవ్రతతో ప్రసవ వార్డులో దోమల బారినుంచి పిల్లలను ఎలా కాపాడుకోవాలని తల్లులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ ఎ.తాతారావును సాక్షి వివరణ కోరగా ఆస్పత్రిలో శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్ భవనాలను తొలగిస్తున్నామని, అందుకు సంబంధించిన రబ్బిష్ సామగ్రి డ్రెయినేజీల్లో అడ్డంగా పడడం వలన మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందని వెంటనే తొలగింపు పనులను చేపట్టి మురుగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

విద్వేష రాజకీయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న కొప్పర్తి

తణుకు అర్బన్: మెజారిటీ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైనదని ప్రముఖ చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణమూర్తి పేర్కొన్నారు. తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో కన్వీనర్ డీవీవీఎస్ వర్మ అధ్యక్షతన సాంస్కృతిక జాతీయవాదం-రాజ్యాంగ విలువలు అనే అంశంపై నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నివసించే ప్రజలందరికీ చెందిన భారత ప్రాదేశిక జాతీయ వాదానికి, మెజారిటీ మతానికి మాత్రమే పరిమితమైన జాతీయవాదాల మధ్య సంఘర్షణ జరుగుతుందని, ఈ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైనదని తెలిపారు. భారత రాజ్యాంగం కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ సమానంగా ప్రజాస్వామ్య హక్కులను కల్పించిందని, దేశ ప్రజలు ఒక జాతిగా రూపొందడానికి ప్రాతిపదికను ఇచ్చిందని మెజారిటీ మత జాతీయవాదం కేవలం అధికారం కోసం ప్రజలను విభజించి చేసే విద్వేష రాజకీయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అవుతుందన్నారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ తరపున డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీ కుమార్ సంభాషణజ్ఞ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు నూర్ అహ్మద్ రెహ్మాన్, వివిధ రంగాలకు చెందిన పురప్రముఖులు ఆకుల వెంకటేశ్వరరావు, డాక్టర్ వి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన



ఆకుతీగపాడు గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణ

పెంటపాడు: భక్తులకు పార్వతి సమేత సోమేశ్వర స్వామి అనుగ్రహం ఉండాలని మాజీ ఉపముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన పెంటపాడు మండలం ఆకుతీగపాడు గ్రామంలో రూ. 1 కోటి నిధులతో నూతనంగా నిర్మించబోతున్న పార్వతి సోమేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో జగనన్న ప్రభుత్వంలో దేవాదాయశాఖ ద్వారా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కోట్లాది రూపాలయల నిధులు సీజెఎఫ్ నిధులతో నియోజకవర్గాని ఆధ్మాత్మిక పరంగా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ అభివృద్ధి ఆగిపోయిందన్నారు. గతంలో మంజూరు చేసిన నిధులతోనే పనులు జరుగుతున్న సంగతి ప్రజలు గుర్తుంచుకోవాలని తెలిపారు. ఆకుతీగపాడు గ్రామానికి రహదారికి రూ. 3 కోట్లు అందించాం. ఆ రహదారి పూర్తయ్యేలా కూటమి ప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామంతో పాటు, పలు గ్రామాల్లో అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, గుండుమోగుల సాంబయ్య, ముప్పిడి సంపత్‌కుమార్, కైగాల శ్రీనివాస్, బోణం వీరయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొణతాల వెంకట్రావు, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, శిర్రాపు శాంతకుమార్, గోకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

తణుకు అర్బన్: విద్యుత్ ప్రైవేటీకరణలో భాగమే అదానీ స్మార్ట్ మీటర్లు బిగింపని, అదానీ స్మార్ట్ మీటర్లు ఒప్పందం అవినీతి అని చెప్పిన టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎలా ఆ అవినీతిని సమర్థిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అధ్యక్షతన సోమవారం తణుకు అమరవీరుల భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఒప్పందం అవినీతిమయం అని చెప్పిన టీడీపీ నేడు అదే అవినీతి ఒప్పందాన్ని తాము ఎలా అమలు చేస్తున్నారో రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలపై భారాలు వేసి అదానీ లాంటి సంపన్నులకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక చార్జీల పేరుతో విద్యుత్ భారాలు వేస్తున్నారని ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగింపు వలన ఆ భారాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆమోదం లేకుండా స్మార్ట్ మీటర్లు పెట్టమని, కేవలం సంస్థలు, వ్యాపారస్థులకు మాత్రమే పెడతామని చెప్పిన మంత్రి రవికుమార్ చిరువ్యాపారులు కూడా ప్రజలేనన్న విషయం గుర్తించాలన్నారు. స్మార్ట్ మీటర్లు వలన ప్రీపెయిడ్ రీచార్జ్ చేసుకోవాల్సి వస్తుందని, వినియోగాన్ని బట్టి చార్జీలు పెరుగుతాయని, వేసవి కాలం, వర్షాకాలం, శీతాకాలం వంటి కాలాలను బట్టి కూడా చార్జీలు మారతాయని తెలిపారు. కాబట్టి నాడు ప్రతిపక్షంలో లోకేష్ చెప్పినట్లు ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను బలవంతంగా బిగిస్తే బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి



తణుకులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భీమారావు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో పార్టీ మహాసభల ప్రజా ప్రదర్శన, బహిరంగ సభల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాసభల సందర్భంగా ఈనెల 19న తణుకు పట్టణంలో నిర్వహించే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలకు సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యంగా గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలిచ్చి పేదలను ఆదుకోవాలన్నారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ కమిటీ సభ్యులు గార ప్రసాద్, గుబ్బల వెంకటేశ్వరరావు, పుట్టా అమ్మిరాజు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



మండల నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ స్మార్ట్ మీటర్స్‌ను తిప్పి కొట్టాలని, ప్రభుత్వం బిగిస్తు న్న స్మార్ట్ మీటర్లును ప్రజలు తప్పక వ్యతిరేకించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావులు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్స్ వ్యతిరేకిస్తు ఈ నెల 5వ తేదీన విద్యుత్ స్టేషన్ వద్ద జరిగే ధర్నాని జయప్రదం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ పేరుతో ప్రజలపై వేల కోట్లు రూపాయిలు భారం వేస్తుందని విమర్శించారు. సెల్‌ఫోన్ తరహాలో రీచార్జ్ చేసుకున్నట్టుగానే ముందుగానే ఇంటి కరెంట్‌కు డబ్బులు చెల్లించి రీచార్జ్ చేసుకోవాల్సి వస్తుందన్నారు. రీచార్జ్ చేయకపోతే ఇంట్లో కరెంటు ఉండదన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రజలంతా ఏకమై వాటిని వ్యతిరేకించాలని, బిగించడానికి వస్తే అడ్డుకోవాలన్నారు. ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక విద్యార్థినులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం ఫణిశ్రీ, పీడీ సూర్యనారాయణ

తణుకు అర్బన్: తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 3వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తణుకు మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.ఫణిశ్రీ తెలిపారు. అండర్–16 బాలికల విభాగంలో ఎం.నాగలక్ష్మి లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, జి.తేజారత్నం 600 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, బి.దివ్యశ్రీలక్ష్మి హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని స్పష్టం చేశారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ విద్యార్థులు ఎంపికై నట్లు వివరించారు. విద్యార్థులతోపాటు వారికి శిక్షణనిచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బేసిక్ స్కూల్ విద్యార్థిని

పెంటపాడు: ఈనెల 9, 10, 11 తేదీలలో చీరాలలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ పోటీలకు ప్రభుత్వ బేసిక్ స్కూల్ విద్యార్థిని చాందిని ఎంపికై నట్లు స్కూల్ హెచ్‌ఎం రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి చదువుతున్న జి. చాందిని రన్నింగ్, 60 మీటర్ల లాంగ్‌జంప్, బ్యాక్ షార్ట్‌పుట్ విభాగంలో జిల్లా తరపున ప్రతిభ కనపరచినట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టరేట్ పైఅంతస్తులోని వీసీ సమావేశ మందిరం పక్కన సోమవారం బేబీ ఫీడింగ్ రూమ్(చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చు గది)ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.

కలుపుగడ్డి తొలగింపునకు ఇండోఫిల్ నూతన ఉత్పాదనలు



తణుకులో ఇండోఫిల్ సంస్థ కొత్త ఉత్పాదనలను చూపిస్తున్న శ్రీకాంత్ తదితరులు

తణుకు అర్బన్: వరిపంటలో కలుపుగడ్డిని తొలగించేందుకు రైతాంగానికి పూర్తి సహకారం అందేలా ఇండోఫిల్ సంస్థ రెండు కొత్త రకాల ఉత్పాదనలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏపీ, తెలంగాణ మార్కెటింగ్ జెడ్‌డీజీఎం శ్రీకాంత్ అన్నారు. తణుకు చిట్టూరి హెరిటేజ్‌లో సోమవారం రైతులు, డీలర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 60 సంవత్సరాలుగా రైతుల శ్రేయస్సుకోసం ఎన్నో రకాల ఉత్పాదనలు అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఇటీవల కొత్తగా కలుపుగడ్డిని తొలగించుకునే రెండురకాల ఉత్పాదనలు రైతాంగానికి సహకారంగా ఉంటాయని, ఓస్టా ఆఫ్ సెట్, కాంట్రియో అనే ఈ నూతన ఉత్పాదనలు ఎంతో సౌకర్యమైన ఫలితాలు ఇస్తాయని స్పష్టం చేశారు. గోదావరి రీజియన్ సేల్స్ ఆర్ఎస్ఎం కేవీ శేషారెడ్డి, ఆర్‌డీజెడ్ఎం పి.వెంకటసాయి, భీమవరం సేల్స్ బీఎం కె.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ఆయన సందర్శించారు. స్టాల్స్ నందు ఏర్పాటు చేసిన ఉప్పాడ, పట్టు చీరలు, మంగళగిరి కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్, వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్ కుమార్, ఆప్కో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ముర్రు పాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను పంచాయతీ కార్యాలయం వద్ద తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కృపా



ఇరగవరం పీహెచ్‌సీలో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఎంఎల్‌హెచ్‌పీ కృపా అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఆరుగొలను సబ్ సెంటర్‌లో తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృపా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట లోపు తల్లి ముర్రు పాలు పట్టించాలని, తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పోత పాలు వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు జీఎస్ఎన్.లక్ష్మి, బి.రాణి, ఎస్‌కే. కాజా బీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి

ఇరగవరం: తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం చేయాలని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని ఇరగవరం పీహెచ్‌సీలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహలక్ష్మి, మాణిక్యంబ తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లి పాలలో రోగ నిరోధక శక్తి గుణాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యాక్సిన్ కన్నా తల్లి పాలలోనే ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. దీనిపై గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మమత పీహెచ్ఏఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.